www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 6 సెప్టెంబర్ 2025 5 కాకినాడ



నేడు సోలార్‌పై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి-శంఖవరం

ప్రతి ఒక్కరూ ఇంటి పైకప్పుపై సౌరఫలకాలు ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ బిల్లులు తగ్గడంతో పాటు, పర్యావరణానికి మేలు కలుగుతుందని రైతు రాజ్యం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వట్టికోళ్ల శ్రీనివాస నాయుడు అన్నారు. సౌర విద్యుత్తుపై శనివారం యుజె.పురం, కొత్తూరులోని వట్టి కోళ్ల వెంకట రావు ప్రాంగణంలో ప్రజలకు అవగాహనా సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సదస్సులో యునైట్ సోలార్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవిచంద్ర వర్మ పాల్గొంటారని తెలిపారు. సౌర విద్యుత్ వల్ల ప్రజలకు నగదు ఆదా అవుతుందని, ఇది అందరికీ ఉపయోగపడే పథకం అని, దీన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉపాధి లేని ఆటో డ్రైవర్లు

- ఉచిత బస్సుతో ఆటోలు వెలవెల
- కుటుంబాల పోషణకు అవస్థలు
- జీవన భద్రత కల్పించాలని డిమాండ్

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ప్రభుత్వాల నుంచి ఉపాధి అవకాశాలు తగ్గిపోవడంతో అనేక మంది స్వయం ఉపాధి మార్గాల వైపు మళ్లారు. వివిధ రకాల ఉద్యోగ, వ్యాపారాలు సాగిస్తూ జీవనం సాగిస్తున్నారు. కాస్తో కూస్తో సంపాదించుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఈ కోవలోకి ఆటో డ్రైవర్లు కూడా వస్తారు. తమ కాళ్ళపై తాము నిలబడేందుకు ఆటోలను కొనుగోలు చేసుకుని ఉపాధి పొందుతున్నారు. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు సైతం ఆటో నడుపుకుంటూ జీవన భతి పొందుతున్నారు. ఒక వైపు ఫైనాన్స్ కట్టుకుంటూనే మరోవైపు తమ భార్యా పిల్లలను పోషించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో కూటమి సర్కారు తమ సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా 'స్త్రీశక్తి' పథకాన్ని గత నెల 15 నుంచి అమలు చేస్తోంది. దీంతో తమ ఉపాధి పూర్తిగా దెబ్బతిందని డ్రైవర్లు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజంతా ఆటో నడిపితేనే గానీ పూట గడవని పరిస్థితుల్లో వారు ప్రస్తుతం కొట్టుమిట్టాడుతున్నారు.

జిల్లాలో 30 వేల మందికి పైనే జీవనం

జిల్లాలో ఆటోలు నడుపుకుంటూ 30 వేల మందికి పైనే కార్మికులు తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు. సరాసరి ఒక్కో మండలంలో 1500 మంది చొప్పున ఆటో డ్రైవర్ కమ్ ఓనర్‌గా జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు లేక అనేకమంది విద్యార్హత ఉన్నవాళ్లు కూడా ఆటోలను నడుపుకుంటూ జీవిస్తున్నారు. వివిధ ఫైనాన్స్ సంస్థలలో రుణాలు పొంది నెల నెలా వాయిదాలు పద్ధతిలో చెల్లిస్తూ వ్యాపారం చేస్తున్నారు. రోజంతా కష్టపడి నడిపితే ఆయిల్ ఖర్చులు పోను రూ.800 నుంచి రూ.1200 వరకూ సంపాదించుకుంటున్న పరిస్థితి. ఉచిత బస్సు పథకం అమలు తర్వాత సగానికి వ్యాపారం పడిపోయిందంటూ పలువురు ఆటో కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కే వారు లేక నిరాశ చెందుతున్నారు. ప్రయాణికుల కోసం ఎదురు చూస్తున్నప్పటికీ నిరాశ తప్పడం లేదంటూ ఆందోళన చెందుతున్నారు. నెల నెలా ఫైనాన్స్ కట్టుకోవడం, కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారిందంటూ కన్నీరు పెట్టుకుంటున్నారు.

జీవన భద్రత కల్పించాలని డిమాండ్

వ్యాపారం కోల్పోయిన నేపథ్యంలో తమకు జీవన భృతి కల్పించాలని ఆటో కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని అన్ని ప్రాంతాల్లోనూ ఆటో డ్రైవర్లు నిరసన గళం వినిపిస్తున్నారు. ఇటీవల కాకినాడ జిల్లా కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో ఆటోడ్రైవర్లంతా పెద్ద ఎత్తున ప్రదర్శన చేసే కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అధిక సంఖ్యలో ఆటో కార్మికులు పాల్గొని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆటోలకు ముఖ్య ప్రయాణికులు మహిళలే కావడంతో వ్యాపారం పూర్తిగా దెబ్బతిందని ఈ సందర్భంగా వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏదైనా కొత్త విధానం తీసుకుని వచ్చేటప్పుడు దాని ప్రభావం ఎలా ఉంటుందో ముందుగానే ఆలోచించి నిర్ణయం తీసుకుంటే తాము ఇలా రోడ్లమీద పడే వాళ్ళం కాదంటూ చెబుతున్నారు. తమకు జీవన భద్రత కల్పించాల్సిన బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలని కోరుతున్నారు. ఆటోకు ఇంధనం వేయించి నెలకు రూ.26 వేలు చెల్లిస్తే ప్రభుత్వ నిబంధనలకు లోబడి రోజుకు 8 గంటలు పాటు మహిళలను తమ గమ్యస్థానాలకు ఉచితంగా చేర్చడానికి సిద్ధంగా ఉన్నామని డ్రైవర్లు తెలిపారు.



కాకినాడలో ఆందోళన చేస్తున్న ఆటో డ్రైవర్లు



ఎక్కే వారి కోసం ఎదురుచూపులే

ఆటో ఎక్కే ప్రయాణికులు బాగా తగ్గిపోయారు. ఆటోలకు డిమాండ్ తగ్గిపోయింది. గతంలో రోజుకి రూ.1000 సంపాదించే వాడిని. పథకం అమలు తర్వాత రూ.400 మించి రావడం లేదు. ఈయంఐలు చెల్లించడం, కుటుంబ పోషణ కష్టంగా మారింది. ప్రభుత్వం మాకు జీవన భతిని కల్పించి ఆదుకోవాలి.

- పిల్లి పరందమశెట్టి, ఆటో కార్మికుడు, కాకినాడ



ఉపాధి లేక రోడ్డున పడ్డాం

మహిళలకు ఉచిత బస్సు పథకం వల్ల ఉపాధి లేక రోడ్డున పడ్డాం. ఆదాయం పడిపోవడంతో ప్రతి ఆటో డ్రైవర్ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నాం. అప్పుల పాలై వడ్డీలు కట్టలేకపోతున్నాం. డ్రైవర్‌కు నెలకు రూ.5 వేలు పింఛన్ ఇవ్వాలి, పెట్రోల్, డీజిల్‌పై సబ్సిడీ ఇవ్వాలని కోరుతున్నాం.

- నులుకుర్తి సూర్య ప్రకాష్, ఆటో డ్రైవర్, కాకినాడ.

ఉపాధి బకాయిలు విడుదల చేయాలి

ప్రజాశక్తి-కాకినాడ

రాష్ట్రంలో ఉపాధి హామీ కూలీ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు డిమాండ్ చేశారు. శుక్రవారం కాకినాడ సుందరయ్య భవన్‌లో నిర్వహించిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో సుబ్బారావు మాట్లాడారు. 2025- 26కు సంబంధించి ఏప్రిల్, మే, జూన్ నెలలో ఉపాధి హామీ పనులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఒక రూపాయి కూడా విడుదల చేయలేదని, ఆ రకంగా రూ.కోట్లాది బకాయిలు పేరుకు పోయాయన్నారు. ఒక్కొక్క కుటుంబానికి రూ.పది వేల బకాయి ఉందని, దీంతో కూలీలు అనేక ఇబ్బందులు పడుతూ అప్పులు చేసుకుని కుటుంబ జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా కూటమి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చి కూలి డబ్బులు ఇప్పించడంలో వైఫల్యం చెందిందని విమర్శించారు. ఒకపక్క అధిక ధరలతో సతమతం వుతున్న కూలీలకు చేసిన పనికి కూడా కూలి రాకపోవడం అన్యాయమన్నారు. పేదలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం కూలీలు చేసిన కూలి డబ్బులే ఇప్పించలేని దౌర్భాగ్య పరిస్థితిలో ఉందని విమర్శించారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టేకుమూడి ఈశ్వరరావు, కెఎస్.శ్రీనివాస్ జిల్లా నాయకులు కూరాకుల సింహాచలం, దుప్పి అదృష్టదీపుడు, రుద్రవరపు భూలోకం, పొట్లకాయల కృష్ణ, ఊబా బుల్లబ్బాయి, కె.రాఘవ, గోడి భాస్కరరావు, జగ్గారావు, పెట్ల లాజరు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బారావు

ఆక్వా కార్మికుల ఉపాధిని కాపాడాలి

ప్రజాశక్తి-కాకినాడ

అమెరికా సుంకాల వల్ల ఆక్వా రంగం తీవ్ర సంక్షోభంలో ఉందని, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలగజేసుకొని ఆక్వా పరిశ్రమలు మూత పడకుండా చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జి, జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో సుమారు 1,50,000 ఎకరాల్లో ఆక్వా సాగు ఉందని, సంవత్సరానికి 10 లక్షల టన్నుల ఆక్వా ఉత్పత్తులు జిల్లా నుంచి ఎగుమతి అవుతున్నాయని చెప్పారు. కోనపాపపేట సముద్ర తీరంలో ఏర్పాటు చేసిన హేచరీస్ జిల్లావ్యాప్తంగా విస్తరించి ఉన్న ఆక్వా ఫీడ్ తయారీ పరిశ్రమలు, ప్రాసెసింగ్ యూనిట్లలో సుమారు లక్ష మంది కార్మికులు ప్రత్యక్ష ఉపాధి పొందుతున్నారని తెలిపారు. ఆక్వా సాగు యంత్రాలు, మందులు అమ్మే దుకాణాల ద్వారా మరో 50 వేలమంది పరోక్ష ఉపాధి పొందుతున్నారని తెలిపారు. ఈ సంక్షోభం కారణంగా అనేక చిన్న యూనిట్లు మూసివేశారని వెల్లడించారు. నెక్కంటి, దేవి, అవంతి, అపెక్స్ వంటి పెద్ద యూనిట్లలో ప్రొడక్షన్ 50 శాతానికి పరిమితం చేసి ఆ మేరకు కార్మికులను తొలగిస్తున్నారని తెలిపారు. కొన్ని పరిశ్రమల్లో 8 గంటల పని స్థానంలో 12 గంటలకు పనిని పెంచుతూ సంక్షోభ నష్టాన్ని కార్మికులపై నెడుతున్నారని తెలిపారు. గతంలో పరిశ్రమల్లో కార్మిక శాఖ, ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్, ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేసేవారని, ఇప్పుడు పూర్తిగా తనిఖీలను నిషేధిస్తూ చట్టం చేయడంతో పరిశ్రమల్లో విషయాలు బయటకు తెలియనివ్వడం లేదన్నారు. జిల్లాలో ఏ ఒక్క కార్మికుని తొలగించినా ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా కోశాధికారి మలకా రమణ, జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యులు మేడిశెట్టి వెంకటరమణ, రాణి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

ఆడబిడ్డకు రూ.1500 ఎప్పుడు ఇస్తారు

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 18 ఏళ్లు దాటిన ప్రతి ఆడబిడ్డకూ రూ.1500 ఇస్తానని హామీ ఇచ్చి అమలు చేయకుండా మహిళలను మోసం చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని వైసిపి రాష్ట్ర మహిళ విభాగం ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి అన్నారు. కిర్లంపూడిలో శుక్రవారం మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఆరోగ్య పరిస్థితిని మహిళా నాయకులు అడిగి తెలుసుకున్నారు. పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబును కలిశారు. అనంతరం మహిళా నేతలు మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు చేసిన మోసాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్తామన్నారు. గిరిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు సున్నా వడ్డీ డ్వాక్రా రుణాలు ఇస్తామని ఇచ్చిన హామీను ఏడాది దాటినా అమలు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కార్యదర్శి, జెడ్‌పిటిసి బెహరా రాజరాజేశ్వరి, మాజీ ఎంఎల్‌సి అంగూరి లక్ష్మీ శివకుమారి, మాకినీడి శేషు కుమారి పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయుడు

ఉపాధ్యాయ వృత్తి ఉత్తమమైనది

ప్రజాశక్తి-కాకినాడ

సమాజంలో ఎంతోమంది జీవితాల్లో మార్పు తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తున్న ఉపాధ్యాయ వృత్తి ఉత్తమమైనదని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అన్నారు. శుక్రవారం స్థానిక జెఎన్‌టియుకె అలూమ్ని ఆడిటోరియంలో నిర్వహిరంచిన గురుపూజోత్సవంలో ముఖ్య అతిథులుగా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి, ఎంఎల్‌సిలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, ఎంఎల్ఎలు వనమాడి వెంకటేశ్వర రావు, నిమ్మకాయల చినరాజప్ప, వరుపుల సత్యప్రభ, ట్రైనీ కలెక్టర్ మనీషా పాల్గొన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరుచుకుని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 70 మంది ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. అనంతరం సభలో కలెక్టర్ షాన్ మోహన్ మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి ప్రత్యేక స్థానం ఉందని, ఉపాధ్యాయులు తమ జ్ఞానంతో విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారన్నారు. జిల్లాలో గడిచిన విద్య సంవత్సరం పదో తరగతి పరీక్ష ఫలితాల్లో రాష్ట్రస్థాయి ప్రథమ స్థానం సాధించడం అందరికీ గర్వకారణం అన్నారు. ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు మానసిక దఢత్వాన్ని పెంపొందించుకుంటూ విద్యార్థులను భావిభారత ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని కలెక్టర్ పిలుపు ఇచ్చారు.



సభలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్ మోహన్ సగిలి


జనసేన నాయకులతో మాట్లాడుతున్న కాకినాడ ఎంపీ ఉదయ శ్రీనివాస్

గ్రామ కమిటీల ద్వారా గ్రామాభివృద్ధి

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి

గ్రామ కమిటీల ద్వారా గ్రామాలు అభివద్ధి చెందుతాయని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కొత్తపల్లి సురక్ష ప్యాలెస్‌లో ఏర్పాటు చేసిన సమావవేశంలో ఆయన మాట్లాడారు. సేవలందించిన జనసైనికులను సమావేశం ఏర్పాటు చేసి, కూటమి ప్రభుత్వం కలుపుకుంటూ కమిటీలు వేసేందుకు తమ పార్టీ అధినేత రాష్ట్ర డిప్యూటీ సిఎం కొణిదల పవన్ కళ్యాణ్ కమిటీలు వేమనట్టు ఎంపీ శ్రీనివాస్ తెలిపారు. తొలినుంచీ పార్టీ అభివృద్ధి కరోసం పనిచేసిన గ్రామ నాయకులు పేర్లను అధిష్టానానికి పంపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి, మాజీ ఎంఎల్‌ఎ పెండెం దొరబాబు, నాయకులు జ్యోతులు శ్రీనివాస్ పాల్గొన్నారు

కార్తీక మాసం ఏర్పాట్లపై ఇఒ సమీక్ష

ప్రజాశక్తి-శంఖవరం

అన్నవరం సత్యనారాయణ స్వామి ఆలయంలో కార్తీక మాసం ఏర్పాట్లపై ఇఒ సుబ్బారావు శుక్రవారం అధికారులతో సమీక్షించారు. చైర్మన్ ఐవి రోహిత్ సమక్షంలో నిర్వహిరంచిన ఈ సమావేశంలో వచ్చే నెల 22 నుండి నవంబర్ 18 తేదీ వరకు కార్తీకమాసం సందర్భంగా అధిక సంఖ్యలో యాత్రికులు వస్తారని అంచనాలతో ఏర్పాట్లను సిబ్బంది సమన్వయంతో నిర్వహించాలని ఇఒ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ బాబూరావు పాల్గొన్నారు

నేడు వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 6న ఉదయం పట్టణంలోని 14 సచివాలయాల పరిధిలో ఈ గవర్నస్ వాట్సాప్ సేవలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు ప్రారంభం అవుతాయని, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందిస్తున్న అన్ని రకాల సేవలపై సచివాలయ సిబ్బంది ఆ సచివాలయాల పరిధిలోని ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తారన్నారు. పది రోజుల్లో సచివాలయాల పరిధిలో ప్రజలందరికీ ఈ అవగాహన కార్యక్రమాలు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశామన్నారు.

జెడ్‌పి హైస్కూల్‌కు స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డు

ప్రజాశక్తి-కాజులూరు

జిల్లా పరిషత్ హైస్కూల్‌కు ఇటీవల రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డు లభించడం గర్వించదగిన విషయమని గొల్లపాలెం జెడ్‌పి స్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు జి.సునీల్ కుమార్ అన్నారు. ఇది ఒక బహుమతి మాత్రమే కాక విద్యార్థుల క్రీడా ప్రతిభకు, గురువుల నిబద్ధతకు, సిబ్బంది సమిష్టి కృషికి గుర్తింపుగా నిలిచిందన్నారు. విద్యార్థులు అథ్లెటిక్స్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, తైక్వాండో వంటి రంగాల్లో రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎదిగి పతకాలు సాధించడం ప్రధాన కారణంగా నిలిచిందని తెలిపారు. ఉపాధ్యాయులను తహశీల్దారు రవీంద్రనాథ్ ఠాగూర్, ఎంపిడిఒ రాంబాబు, ఎంఇఒలు డేవిడ్, జాన్, వ్యవసాయ అధికారి అశోక్, నాయకులు తాడి వెంకటరెడ్డి, డేగల వెంకట సతీష్, డేగల నాగేంద్ర, అన్యం శ్రీరామచంద్రమూర్తి అభినందించారు.

చలో విజయవాడ పోస్టర్ విడుదల

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరణ చేస్తామని ఇచ్చిన హామీను అమలు చేయాలని కోరుతూ సెప్టెంబర్ 15 రాష్ట్ర లేబర్ కమిషనర్ రేట్ ముట్టడి జయప్రదం చేయాలని శుక్రవారం స్థానిక భవన నిర్మాణ కార్మిక సంఘం భవనం వద్ద పోస్టర్ విడుదల చేశారు. ఈ సంధర్భంగా ఎపి బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు నెట్ల శ్రీను, ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో భవన కార్మికులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం వస్తే సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టినట్టు తెలిపారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా ఈనాటికీ భవన నిర్మాణ సంక్షేమ బోర్డు కోసం మాట్లాడకపోవడం అన్యాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై ఈ బోర్డు పునరుద్ధరణ చేయడం వల్ల ఎటువంటి అదనపు భారం లేకపోయినా దీనిని అమలు చేయకపోవడం అన్యాయం అన్నారు. రాష్ట్రంలో ఒకపక్క హౌసింగ్ లోన్‌లు విడుదల చేయకపోవడంతో ఈ జిల్లాలో, రాష్ట్రవ్యాప్తంగా భవన కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందన్నారు. పక్క రాష్ట్రాల వలే సంక్షేమ బోర్డు పథకాలు భవన కార్మికులకు ఈ రాష్ట్రంలో అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న క్లైములు తక్షణం విడుదల చేసి కొత్త క్లెయిములు తీసుకోవాలన్నారు. అర్హులైన భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శీరం సత్తిబాబు, ఎ.నొరంజన్, రాజా, వీరబాబు, గానాల గంగాధర్, ధరణాలకోట వీరబాబు పాల్గొన్నారు.


పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు



బాధితురాలికి చోరీ సొత్తు అందజేస్తున్న సిఐ జి.శ్రీనివాస్

బాధితురాలికి చోరీ సొత్తు అందజేత

ప్రజాశక్తి-పిఠాపురం

పట్టణంలోని పోలీసులు కార్యాలయంలో చోరీ సొత్తును సిఐ జి.శ్రీనివాస్ బాధితురాలికి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ 2024లో స్థానిక కుంతీ మాధవ స్వామి గుడి సమీపంలో బంగారు ఆభరణాల చోరీపై కేసు దర్యాప్తు చేశామన్నారు. చోరీకి పాల్పడిన సోమరాజు, సుమంత్‌ను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 80 గ్రాముల బంగారు ఆభరణాలను రికవరీ చేశామన్నారు. కోర్ట్ ఆదేశాల మేరకు బాధితురాలు కృష్ణ వేణికి వాటిని అందజేశామన్నారు. సిఐ జి.శ్రీనివాస్, ఎస్ఐ వి.మణికుమార్‌కు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

7న విశ్వజన కళామండలి వార్షికోత్సవం

ప్రజాశక్తి -తాళ్లరేవు


ఈ నెల 7న విశ్వజన కళామండలి 49వ వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు మండలి రాష్ట్ర అధ్యక్షులు వడ్డి ఏడుకొండలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎపి, తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో నిర్వహింస్తున్న వార్షికోత్సవం హైదరాబాదు రవీంద్రభారతిలో ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ నిర్వహిస్తామన్నారు. సభలో భారతదేశంలో దళితుల స్థితిగతులపై చర్చ జరుగుతుందని రెండు తెలుగు రాష్ట్రాల నుంచి దళిత మేధావులు, సంఘాల నాయకులు హాజరవుతారన్నారు.

వయోజన విద్యా వాలంటీర్లకు శిక్షణ

ప్రజాశక్తి-గొల్లప్రోలు

మహిళా స్త్రీశక్తి భవన్‌లో ఉల్లాస్ అక్షరాస్యత విద్యా వాలంటీర్ల శుక్రవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఉపాధి, డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ తరగతుల్లో వయోజన విద్య డిడి పసుపులేటి పోచయ్య, వయోజనవిద్య ఎపిఒ వాసంశెట్టి త్రిమూర్తులు పాల్గొని మాట్లాడారు. సమాజంలో అందరికీ జీవితకాల అభ్యసన అవగాహన పెంపొందించేందుకు ఉల్లాస్ అక్షర ఆంధ్ర శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కె.స్వప్న, జిల్లా గణాంక అధికారి వివిఎస్.ఆనందబాబు, ఎపిఎం సన్యాసిరావు, వయోజన విద్య ఎస్ఎ పోలిశెట్టి రాజేష్ పాల్గొన్నారు.

కార్టూన్ 'నిజం'



ప్రమాదంలో ప్రజల ఆరోగ్య రక్షణ : వైసిపి

ప్రజాశక్తి కాకినాడ రూరల్

పేద ప్రజలకు అందుతున్న ఆరోగ్యశ్రీ వైద్యాన్ని బీమా కంపెనీలకు అప్పగించి ప్రజల ఆరోగ్య రక్షణలో దీమా లేకుండా చేశారని వైసిపి రాష్ట్ర మహిళా వైస్ ప్రెసిడెంట్ జమ్మలమడక నాగమణి పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రభుత్వ ఆధీనం నుంచి ప్రైవేటు బీమా సంస్థల హస్తగతం చేయడాన్ని ఆమె తప్పు పట్టారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని బీమా సంస్థలకు అందజేయడం ద్వారా కోట్ల రూపాయలు కొల్లగొట్టాలని కూటమి ప్రభుత్వం కుట్ర పన్నడం బాధాకరమన్నారు. ఎంతోమంది పేద ప్రజల ప్రాణాలకు సంజీవనిగా మాజీ సిఎం వైఎస్.రాజశేఖర్ రెడ్డి అందించిన ఆరోగ్యశ్రీ పథకాన్ని కూటమి ప్రభుత్వం పర్సంటేజ్‌లకు ఆశపడి నిర్వీర్యం చేయబోతున్నారని విమర్శించారు.

బి.కొత్తూరు ఘటనపై విచారణ చేపట్టాలి


ప్రజాశక్తి-పిఠాపురం

బి.కొత్తూరులో వినాయక నిమజ్జనం సందర్భంగా జరిగిన సంఘటనపై నిష్పక్షపాత విచారణ చేపట్టాలని మాల మహానాడు నాయకుడు ఆర్ఎస్ రత్నాకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన గాయపడిన దళితులను కలిసి మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... బి.కొత్తూరులో దళితులు గాయాలు పాలవడం భాదాకరన్నారు. రూరల్ ఎస్ఐ జాన్ బాషాతో మాట్లాడి బాధితులకు న్యాయం చేయాలని కోరినట్టు తెలిపారు. సంఘటనపై నిష్పక్షపాత విచారణ చేపట్టాలని, బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వై.సత్తిబాబు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

వైసిపి మేధావుల విభాగం అధ్యక్షునిగా సూర్యనారాయణ

ప్రజాశక్తి- తాళ్లరేవు

వైసిపి మేధావుల విభాగం ముమ్మిడివరం నియోజకవర్గ అధ్యక్షునిగా వ్యవసాయ శాఖ విశ్రాంత జెడి పెట్ల సూర్యనారాయణ రాజు నియమితులయ్యారు. పార్టీ స్థాపించిన నాటి నుంచి ఆయన పార్టీ అభివృద్ధి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడంతో పాటు తన వంతు సహకారాన్ని అందించడంతో ఆయనను ఎంపిక చేశారు. ఆయన ముమ్మడివరం మాజీ ఎంఎల్ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.


పొన్నాడ సతీష్‌కుమార్‌తో సూర్యనారాయణరాజు

నేరాలు ఘోరాలు


వివరాలు వెల్లడిస్తున్న సిఐలు నరేష్‌కుమార్, గజేంద్రకుమార్

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

ప్రజాశక్తి - రాజోలు

ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాల్లో వివిధ జిల్లాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం రాజోలు సర్కిల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా వివరాలను రాజోలు సిఐ ఎల్.నరేష్‌కుమార్, అమలాపురం క్రైమ్ సిఐ గజేంద్రకుమార్ వెల్లడించారు. కొత్తపేట డిఎస్‌పి సుంకర మురళీ మోహన్ ఆధ్వర్యంలో పోలీసులు దొంగతనాలపై నిఘా పెట్టి వరుస చోరీలకు పాల్పడుతున్న రాజోలు మండలం బి.సావరం గ్రామానికి చెందిన కట్ల అర్జున్, ఏలూరుకు చెందిన సోడెం మంగ ప్రసాద్, రాజమండ్రికి చెందిన షేక్ బాష, కాకినాడకు చెందిన షేక్ అజీజ్‌లను అరెస్టు చేశారు. వీరి నుంచి 64 గ్రాముల బంగారం, రెండు కేజీల వెండి, రూ.2.80 లక్షల నగదు మొత్తం రూ.11,58,500 విలువ చేసే సొత్తు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై రాజోలు పోలీస్ స్టేషన్లో 3, తూర్పుగోదావరి జిల్లాలో 1, ఏలూరు జిల్లాలో 4, తెలంగాణ రాష్ట్రంలో 1 కేసు నమోదు అయ్యి ఉన్నాయి. వీరిలో కట్ల అర్జున్‌పై పదికి పైగా దొంగతనాల కేసులు ఉన్నాయి. వీరంతా వివిధ దొంగతనాల కేసుల్లో జైలు కు వెళ్లినపుడు అక్కడ పరిచయం అయ్యి బయటకు వచ్చిన తర్వాత చెడు వ్యసనాలకు బానిసలై మరలా దొంగతనాల బాట పడుతున్నారని పోలీసులు తెలిపారు. ఈ చోరీ కేసును చాకచక్యంగా చేధించిన రాజోలు సిఐ నరేష్ కుమార్, అమలాపురం క్రైమ్ సీఐ గజేంద్రకుమార్, ఎస్ఐలు రాజేష్‌కుమార్, పరదేశి, ఎఎస్ఐ బాలకృష్ణ, హెడ్ కానిస్టేబుల్లు శేఖర్ రాజు, కోళ్ల వెంకట రమణ, కానిస్టేబుళ్లు అర్జున్, ఎం.హరిబాబు, గుబ్బల సాయి కృష్ణ, బి.ప్రసాద్, ఎ.సుధాకర్, ఎల్.శ్రీను, ఆర్.ప్రసాద్, ఎం.రమేష్, కిషోర్, రెడ్డి, ఆర్. శ్రీనులను జిల్లా ఎస్‌పి ప్రత్యేకంగా అభినందించారు.

దొంగతనం కేసులో వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి- తాళ్లరేవు

నీలపల్లిలోని వికాస్ లేఔట్‌లో జూన్ 12న ఒక ఇంటిలో జరిగిన చోరీ కేసులో పలివెల చరణ్‌ను శుక్రవారం అరెస్ట్ చేసినట్టు కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపారు. అతడి వద్ద నుంచి రూ.2 లక్షల విలువైన బంగారం, వెండి వస్తువులు రికవరీ చేశామన్నారు. అతడిని కోర్టులో హాజరు పరిచామన్నారు.

బి.కొత్తూరు ఘటనపై అట్రాసిటీ కేసుల నమోదు

ప్రజాశక్తి-పిఠాపురం

మండలంలోని బి.కొత్తూరులో వినాయక నిమజ్జనం వేడుకల్లో జరిగిన ఘటనపై అట్రాసిటీ కేసు నమోదు చేశామని రూరల్ ఎస్ఐ జాన్ బాషా తెలిపారు. చెల్లి గణేష్, మరో వర్గానికి చెందిన బొంగులూరి పవన్ కుమార్ తమపై దాడి చేసిన వారిపై అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని ఫిర్యాదులు చేశారన్నారు. బి కొత్తూరు గ్రామాన్ని ఎఎస్‌పి మనీష్ దేవరాజ్ పాటిల్ సందర్శించారు. ఇరు వర్గాలు చేసుకున్న ఫిర్యాదులపై విచారణ చేపట్టారు. 9 మందిపై అట్రాసిటీ కేసులు నమోదు చేశారు.

నేడు కామనగరువులో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

అమలాపురం మండలం కామనగరువు రాజులపూడి వెంకటేశ్వరరావు కాలనీ విలేజ్ హెల్త్ క్లినిక్ వద్ద అమలాపురం రోహిణి తల్లి, పిల్లల ఆసుపత్రి ఆధ్వర్యంలో నేడు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ నక్క అరుణకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో ప్రముఖ చిన్న పిల్లలు వైద్య నిపుణులు డాక్టర్ వివిఎస్ఎస్ఎన్.మూర్తి (రోహిణి డాక్టర్) చిన్న పిల్లలకు పుట్టిన పిల్లల నుంచి 15 సంవత్సరాల వరకు అన్ని రకముల ఆరోగ్య సమస్యలను పరీక్షించి ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. స్త్రీ, ప్రసూతి, స్కానింగ్, సంతాన సాఫల్య కేంద్ర వైద్య నిపుణులు డాక్టర్ వి.శారద (రోహిణి మేడం) గర్భిణులకు, స్త్రీల యొక్క అన్ని రకముల ఆరోగ్య సమస్యలకు పరీక్షించి ఉచితం గా మందులు అందజేస్తారన్నారున ఈ అవకాశాన్ని గ్రామ ప్రజలు వినియోగించు కోవలసిందిగా సర్పంచ్ కోరారు. వివరాలకు పిఆర్ఒ ఎ.శ్రీనివాసరావు 917770710ను సంప్రదించాలన్నారు.

నిమజ్జనాల్లో జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి - అంబాజీపేట

వర్షాలు, వరదల నేపథ్యంలో చెరువులు, నదీ ప్రవాహాలు ఎక్కువగా ఉన్నందున గణపతి విగ్రహాల నిమజ్జన సమయంలో ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఉత్సవ కమిటీలు జాగ్రత్తలు పాటిం చాలని కొత్తపేట డిఎస్‌పి సుంకర మురళీమోహన్ అన్నారు. డిఎస్‌పి ఆధ్వర్యంలో అంబాజీపేట వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో సిఐ ఆర్.భీమరాజు అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి ఉత్సవ కమిటీ సభ్యులతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. నిమజ్జన ప్రదేశాలలో చిన్న పిల్లలు, మహిళలను తీసుకురాకుండా ప్రభుత్వ అధికారుల సూచనల మేరకు జాగ్రత్తగా పాటించాలని డిఎస్‌పి సూచించారు. పోలీసులకు సమాచారం తెలియపరచ కుండా నిమజ్జనం, ఊరేగింపు ఎట్టి పరిస్థితులలో జరపరాదని పి.గన్నవరం సిఐ రుద్దరాజు భీమరాజు సూచించారు. ఉత్సవ కమిటీ ముందుగా తీసుకున్న అనుమతుల ప్రకారం తెలియ పరచిన సమయం ఊరేగింపు మార్గం నిర్ణయించిన మార్గం లోనే వెళ్లాలన్నారు. మత్తు పానీయాలు తాగి నిమజ్జనం ఊరేగింపులలో పాల్గొనరాదని అట్టి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. మహిళా పోలీసులు సాయంత్రం ఏడు గంటల వరకు నిమజ్జన కార్యక్ర మం విధుల్లో ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో అంబాజీపేట,పి.గన్నవరం, మామిడి కుదురు, అయినవిల్లి ఎస్ఐలు కె.చిరంజీవి, బి.శివకృష్ణ, ఎ.చైతన్యకుమార్, హరికోటి శాస్త్రి, ట్రైనింగ్ ఎస్ఐలు, ఎఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానం

ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన పలువురికి కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి శుక్రవారం పురస్కారాలు అందజేశారు. వారిని ఘనంగా సత్కరించారు. వారిని పలువురు అభినందించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

కాకినాడ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కాకినాడ కళామందిర్ వస్త్ర వ్యాపార సంస్థ ప్రజావిద్యాలయం ఉపాధ్యాయులకు నూతన దుస్తులు, పండ్లు ఇచ్చి సత్కరించింది. ఈ కార్యక్రమంలో పాల్గొనడం తమకెంతో సంతోషం కలిగించిందని మేనేజర్లు కుమార్ కీర్తి, వెంకటరామకృష్ణ, నవీనరెడ్డి, రామకృష్ణ అన్నారు. విజయాబ్యాంక్ విశ్రాంత ఉద్యోగులు సంఘం పాధ్యాయులను సన్మానించి సూట్‌కేసు రూ.32 వేల విలువైన బ్లాక్ బోర్డు, ఫర్నిచర్ బహుకరించారు. విజయా బ్యాంక్ విశ్రాంత ఉద్యోగులు గాదె సురేష్, దామెర వెంకటరావు, కొమ్మిరెడ్డి నరసింగరావు, శిష్టా రాంగోపాల్, పప్పు జనార్దన్ పూర్ణచంద్రుడు, సిహెచ్.ఉదయభాస్కర్, ఎ.వెంకటేశ్వరరావు, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయా బ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్‌కు, కళామందిర్ వారికి ప్రజావిద్యాలయం కార్యదర్శి వక్కలంక రామకృష్ణ, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

వెంకట్ నగర్ ఆచార్య జూనియర్ కాలేజ్ అండ్ మెడికల్ అకాడమీలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎపిఎస్‌పిఎఫ్ స్పెషల్ కమాండెంట్ డాక్టర్ కొండ నరసింహమూర్తి పాల్గొన్నారు. కాలేజ్ డైరెక్టర్ దుర్గాప్రసాద్ మాట్లాడారు.


పురస్కారం అందుకుంటున్న కోటనందూరు ప్రిన్సిపల్ జి.రాజేశ్వరి


పురస్కారం అందుకుంటున్న రౌతులపూడి ఉపాధ్యాయుడు శ్రీనివాస్


తాళ్లరేవులో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న లయన్స్ సభ్యులు

రౌతులపూడి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికైన ఎ.మల్లవరం మోడల్ ప్రైమరీ స్కూల్ హెచ్ఎం యర్రా శ్రీనివాస్ కలెక్టర్ సాన్‌మోహన్ సగిలి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. శ్రీనివాస్‌ను విద్యాశాఖ అధికారి గాడి కొండబాబు, యుటిఎఫ్ మండల అధ్యక్షుడు కొర్లప్రోలు హరిబాబు, మాజీ ఎంపిపి ఇటంశెట్టి భాస్కర్‌బాబు, ఇటంశెట్టి అశోక్ అభినందించారు. బలరామపురం ప్రైమరీ స్కూల్ హెచ్ఎం గోడి ప్రసన్న జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికైన సందర్భంగా విద్యాశాఖ అధికారి గాడి కొండబాబు, ఎంపిటిసి సోమరౌతు రవి, గ్రామ సర్పంచ్ పైల సీత అభినందించారు.

కోటనందూరు అల్లిపూడి కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయ ప్రిన్సిపల్ జి.రాజేశ్వరి ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపికయ్యారు. జిగటాల వీరబాబు, గరిసింగు దివ్య, నాయుడు, పి.చిన్ని మాస్టర్, స్థానిక ఉపాధ్యాయులు ఆమెకు అభినందనలు తెలిపారు.

ఏలేశ్వరం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అనసూయ నాగేశ్వరరావు స్థానిక విశ్రాంత ఉద్యోగ సంఘ భవనంలో శుక్రవారం విశ్రాంత ఉపాధ్యాయులు ఉద్దగిరి సోమరాజు, ఎండి ఇబ్రహీం ఖాన్, పి.జోగిరాజు, ఎబివి.ప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వసంత ప్రసాదరావు, వివిఎస్.అస్మండ్, తిరుపతిరావు, సిహెచ్ సత్య గాంధీ, జాన్ విల్సన్ బాబు, మజ్జితాతారావు ఉన్నారు.

జగ్గంపేట అంబేద్కర్ నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని వాకచర్ల వరలక్ష్మి కుమారి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. ఆమెకు ఎంఇఒ ఆర్.స్వామి, యుటిఎఫ్ జిల్లా నాయకులు పివి.సత్యనారాయణ, ఎంవి.సాయిరాం, యుటిఎఫ్ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, పి.నాగేశ్వరరావు శుభాకాంక్షలు తెలిపారు.

శంఖవరం కత్తిపూడిలోని మాధురి విద్యాలయం చైర్మన్ కడారి తమ్మయ్య బాబు టీచర్స్ డే సందర్భంగా శుక్రవారం విద్యాలయంలో వారి సతీమణి సీతాదేవి ఆధ్వర్యంలో గురుపూజోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ బాబు మాట్లాడుతూ మన జీవితాలను మలచడంలో ఉపాధ్యాయులు పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి బహుమతులు అందజేశారు.

కరప ఉత్తమ ఉపాధ్యాయునిగా మెర్లాస్ జిల్లా పరిషత్ హైస్కూల్ సోషల్ టీచర్ పట్టా సూర్యప్రసాద్ ఎంపికయ్యారు. గ్రామ సర్పంచ్ నీలిమ రాజేష్, మెర్ల వీరయ్య చౌదరి, డాక్టర్ బోండా వెంకన్న రావు ప్రసాద్ దంపతులను ఘనంగా సత్కరించారు.

సామర్లకోట పట్టణ పరిధిలో ఉపాధ్యాయ దినోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉత్తమ ఉపాధ్యాయులతో పాటు విశ్రాంత ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. గౌరవించారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన కంటిపూడి గోపాలకృష్ణ, సుధారాణి, హెచ్ఎంలు కెఎంఎంఆర్ ప్రసాద్, ఎం.కామేశ్వరరావు, ఉపాధ్యాయుడు వీరన్నను ఘనంగా సత్కరించారు.

తాళ్లరేవు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు


పురస్కారం అందుకుంటున్న జగ్గంపేట ఉపాధ్యాయిని వరలక్ష్మీ


కాకినాడలో ఫర్నిచర్ అందిస్తున్న విజయా బ్యాంక్ సిబ్బంది


కాకినాడలో ఆచార్య జూనియర్ కాలేజీలో..

కన్నీడి నాగవేణి భూపతి సుమశ్రీ, కన్నేపల్లి అప్పలనాగేంద్రశర్మ, ఫయాజ్ సయ్యద్, మందపల్లి సూర్యప్రకాష్, వేగేశ్న వెంకటేశ్వరరాజు, ఎస్‌వి.రమణ కుమార్‌ను సత్కరించారు. క్లబ్ అధ్యక్షుడు పొన్నాడ పేరయ్య రాజు, వేలూరి సూర్యనారాయణ రాజు, బిళ్లకుర్తి శ్రీనివాస్ రెడ్డి, పెనుమల్లు నరేందర రెడ్డి, కట్టా ఆదినారాయణ, ధూళిపూడి వెంకటరమణ, చోడే శ్రీనివాస్, మాలతి వసుంధర, సామా భగవాన్, టేకుమూడి ఈశ్వరరావు, హెచ్ఎం. సాయి ప్రసాద్ పాల్గొన్నారు.

గొల్లప్రోలు అనిశెట్టి సీతారామరాజుకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. ఆయనను పలువురు అభినందించారు.

పిఠాపురం ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా మండల వనరుల కేంద్రంలో ఎంఇఒ శ్యాంబాబు, నారాయణ దాసు ఆధ్వర్యంలో యుటిఎఫ్ నాయకులు పి.శ్రీనివాస్, డి.ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యాన ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. అవార్డు గ్రహీతలు బివివి.సుబ్రహ్మణ్యం, బి.ఆశాలత, ఎస్.ప్రసాద్, ఎస్.సత్యమూర్తి, బిశాంతి, ఎన్.గంగభవాని, కె.రాజ్యలక్ష్మి, ఎస్.చాందిని, ప్రకాశరెడ్డి, సుబ్బరాజును ఘనంగా సత్కరించారు.

ఒప్పందాలను రద్దు చేసుకోవాలి

- నేడు అమెరికా అధ్యక్షుడు టారిఫ్ పెంపునకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు
- సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు


సమావేశంలో మాట్లాడుతున్న కారెం వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - అమలాపురం

తక్షణం కేంద్ర ప్రభుత్వం అమెరికాతో చేసుకున్న ఒప్పందాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసుకోవాలని సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వ రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారతీయ సరు కుల దిగుమతులపై సుంకాన్ని 50శాతానికి పెంచుతూ అమెరికా అధ్యక్షుడు ప్రకటించడాన్ని తక్షణం వెనక్కి తీసుకోవాలని, అమెరికా సుంకాలపై ప్రధాని మోడీ నోరు మెదపడం లేదని ఇవి భారత వ్యవసాయ రంగాన్ని వాణిజ్య వ్యవస్థను కుదేలు చేస్తుందన్నారు. శుక్రవారం సిపిఎం జిల్లా కార్యాలయం గొల్లగూడెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమెరికాతో చేసుకున్న వాణిద్య ఒప్పందాలు మన దేశ ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం పడుతుందనానరు. ఆక్వా, టెక్స్టైల్స్, గార్మెంట్స్ వంటి ఉత్పత్తుల ధరలు ఘోరంగా పడిపోయాయని అన్నారు. దేశ సముద్ర ఉత్పత్తుల్లో 40శాతం ఎగుమతులు ఆంధ్రప్రదేశ్ నుండి అవుతున్నాయి. మన ఎగుమతులపై సుంకం పెంచి మరోవైపు అమెరికా నుంచి వ్యవసాయ ఉత్పత్తుల్ని పన్నులు లేకుండా దిగుమతి చేసుకోవాలని, రష్యా నుండి ఆయిల్ కొనుగోలు ఆపాలని షరతులు పెడుతుందని ఇది సబబు కాదని ఎద్దేవా చేశారు. అమెరికా వీసాలకు నిబంధనలు కఠినతరం చేయడం, కాలపరిమితిని తగ్గించడం, జరిమానాలు విధించడం వంటి కారణాలతో ఎన్నో ఆశలతో ఉన్నత విద్యన భ్యసించిన విద్యార్థుల కలలు పేకమేడల్లా కూలిపోతున్నాయనీ వాపోయారు. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేందుకు టిడిపి కూటమి కూడా ఏమాత్రం ప్రయత్నించకపోవడం సరికాదన్నారు. మన దేశ ప్రయోజనాలు కాపాడేందుకు, సార్వభౌమత్వ పరిరక్షణ కొరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిలబడాలని డిమాండ్ చేస్తూ అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సెప్టెంబర్ 6న నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని వామపక్ష పార్టీలు పిలుపు నిచ్చాయని అన్నారు. అందులో భాగంగా ఈనెల 6న శనివారం జిల్లాలో జరిగే నిరసన కార్యక్రమా లు అన్నింటిలోనూ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి.దుర్గాప్రసాద్, బలరాం తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ఆశా వర్కర్లు పోరాడాలి


గొల్లవిల్లిలో ఆశా వర్కర్ల యూనియన్ సమావేశం

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

ఆశా వర్కర్ల సమస్యలపై ఐక్యంగా పోరాడి సాధించాలని ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మలక సుభాషిని పిలుపు నిచ్చారు. గొల్లవిల్లిలో శుక్రవారం ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బీర ఎస్తేరు రాణి అధ్యక్షతన ఆశా వర్కర్ల యూనియన్ సమావేశం సిఐటియు నాయకురాలు పి.బేబీగంగారత్నం ఆధ్వర్యంలో నిర్వహించారు.అనేక పోరాటాల ఫలితంగా ఆశా వర్కర్లకు ఆరు నెలలు మెటర్నటీ సెలవు, ఉద్యోగ విరమణ ప్రయోజనాలు, ఉద్యోగ విర మణ వయసు 62 సంవత్సరాలు సాధించుకు న్నామని అన్నారు. రానున్న రోజుల్లో ఆశా వర్కర్లకు వేతన పెంపు, టిఎ, డిఎ తదితర డిమాండ్లపై ఐక్యంగా పోరాడుదామని పిలుపునిచ్చారు. మండల స్థాయిలో ఆశా వర్కర్లు నాయకత్వ బాధ్యత తీసుకోవాలని కోరారు. ఆశా వర్కర్ల యూనియన్ మండల అధ్యక్షురాలుగా ఆదిలక్ష్మి, కార్యదర్శిగా మేకల బాలవేణి, కోశాధికారిగా విజయలక్ష్మి తో పాటు మరో నలుగురితో కమిటీని ఏర్పాటు చేశారు.

ఫ్లెక్సీలపై వివాదాస్పద రాతలను అరికట్టండి

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

ప్రశాంతంగా ఉండే గ్రామాలలో వివాదాస్పద రాతలతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి వివాదాలకు కారణం అవుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని మాల మహానాడు జెఎసి నాయకులు శుక్రవారం ఎంపిడిఒ భూపతిరాజు తులసి కృష్ణకు వినతి పత్రం అందజేశారు. గ్రామాల్లో ఘర్షణలు జరిగే ప్రమాదం ఉందని ఇటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాల వద్ద బోర్డు లపై తప్పనిసరిగా జిల్లా పేరు రాసేటప్పుడు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అని రాసి ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రింటింగ్ ప్రెస్‌ల యజమానులు కూడా వారు ప్రింట్ చేసే వాటిపై అడ్రస్ ముద్రించేటప్పుడు తప్పనిసరిగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా పేరు ప్రింట్ చేసే విధంగా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో వారు కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో వైస్ ఎంపిపి సాదే శ్రీనివాసరావు, సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, మాజీ సర్పంచ్ గెడ్డం సురేష్ బాబు, జెఎసి నాయకులు కుంచే బాబులు, దేవరపల్లి రాంబాబు, గుంట్రు చిట్టిబాబు, దేవరపల్లి వెంకటేశ్వరరావు, పరమట మురళి ఉన్నారు.

7న బాల బాలాజీ ఆలయం మూసివేత

ప్రజాశక్తి - మామిడికుదురు

సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామి ఆలయాన్ని ఈనెల 7న ఆదివారం తేదీ మధ్యాహ్నం రెండు గంటల నుంచి మూసి వేస్తున్నట్లు సహాయ కమిషనర్ సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలోతెలిపారు సోమవారం ఆలయాన్ని సంప్రోక్షణ చేసిన అనంతరం ఉదయం 10 గంటల నుంచి స్వామి వారి దర్శనములు యతావిధిగా జరుగుతాయన్నారు.

రాజకీయ లబ్ధికోసమే వైసిపి ఆందోళనలు

ప్రజాశక్తి - కొత్తపేట

ప్రభుత్వం పారదర్శకంగా యూరియా సరఫరా, పంపిణీ చేస్తున్నా రాజకీయ లబ్ధి కోసమే వైసీపీ ఆందోళనలు చేపడుతోంది అని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి విమర్శించారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ గత వైసిపసి ప్రభుత్వంలో కన్నా ఎక్కువ యూరియాను కూటమి ప్రభుత్వం పంపిణీ చేస్తోందన్నారు.

పలు అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

అమలాపురం మండలం బండారులంక నక్కావారిపేటలో పలు అభివృద్ధి పనులను గ్రామ సర్పంచ్ పెనుమాల సునీత పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జలజీవన్‌మిషన్‌లో భాగంగా ఇంటింటి కుళాయి పనులను త్వరిత గతిన పూర్తి చేసి సకాలంలో ప్రజలకు నీరు అందించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అలాగే వాటర్ ట్యాంకు వద్ద జరుగుతున్న రిపేరు పనులను పరిశీలించారు. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రం నందు నిర్మిస్తున్న కిచెన్ గార్డెన్ పనులను పరిశీలించారు. పిల్లలకు రాష్ట్ర ప్రభుత్వం పౌష్టిక ఆహారం అంది స్తుందని ప్రతి ఒక్కరు వినియోగించుకుని పిల్లల సంఖ్యను పెంచాలని సూచించారు.

పాఠశాలలో వంట షెడ్డు ప్రారంభం

ప్రజాశక్తి - అయినవిల్లి

నేదునూరు పెదపేట ఎంపిపి మోడల్ పాఠశాల నందు స్థానిక ఎంపిటిసి సభ్యులు ఇండుగుల వెంకట్రామయ్య ఆర్థిక సహకారంతో వంట షెడ్డును నిర్మించారు. శుక్రవారం స్థానిక సర్పంచ్ గుమ్మడి ప్రసాద్, ఎంఇఒ మేల్లం శ్రీనివాసరావు చేతుల మీదుగా ఆయన వంట షెడ్డును ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఇండుగుల వెంకట్రామయ్యను, బదిలీపై వెళ్లిన పాఠశాల హెచ్ఎం ఎం.రామకృష్ణను ఘనంగా సన్మానించారు. ఎంపిటిసి సభ్యులు కె. సుబ్బరాజు, మాజీ ఎంపిపి జి.వెంకటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

యానాం వార్తలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆకొండి శ్రీనివాస రాజారావు

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

ప్రజాశక్తి - యానాం

యానాంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక రీజెన్సీ పబ్లిక్ స్కూల్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంగీత విద్వాంసులు, రచయిత, ఆకాశవాణి, దూరదర్శన్ కళాకారుడు ఆకొండి శ్రీనివాస రాజారావు సతీ సమేతంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల ద్వారానే సమాజంలో నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ లర్పించారు. అనంతరం సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం టివిఎస్ఎస్‌వి.ప్రసాదరావు, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ మార్తాండ ప్రసాద్, ఇన్‌ఛార్జి సిహెచ్.వీరభద్ర రావు, ప్రైమరీ ఇన్‌ఛార్జి పి.లక్ష్మి పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

చంద్రమాంపల్లిలో శుక్రవారం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప ఆదేశాలు మేరకు గ్రామ ప్రజలకు పాత రేషన్ కార్డులు స్థానంలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు రేలంగి బుజ్జి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రేలంగి వెంకటరావు, వెన్నా వెంకటేష్, కంటి పోయిన చంటిబాబు, కె.ప్రసాద్, బి.వీరయ్య, నూకలమంతి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నాటక అకాడమీ డైరెక్టర్ కు సత్కారం

ప్రజాశక్తి - రామచంద్రపురం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టిడిపి బిసి సెల్ కార్యవర్గ సభ్యులు పెంకే సాంబశివరావు సతీమణి పెంకే అన్నపూర్ణ ఎపి రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ద్రాక్షారామ నాటక కళాపరిషత్ అధ్యక్షుడు, హసన్ బాద గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు ఆధ్వర్యంలో పరిషత్ సభ్యులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సతీష్‌రావు మాట్లాడుతూ మన ప్రాంతానికి చెందిన పెంకే అన్నపూర్ణను నాటక అకాడమీ డైరెక్టర్ గా నియమించిన సిఎం చంద్రబాబుకు, మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు సాంబ శివరావు, అన్నపూర్ణ మాట్లాడుతూ నాటక రంగ అభివృద్ధికి కృషి చేస్తామని తెలియజేశారు. కార్యక్ర మంలో పరిషత్ కోశాధికారి వేమవరపు రాంబాబు,బుర్రకథ కళాకారులు గరగ బాబూరావు, వాడ్రేవు వెంకటరావు, పరిషత్ ఆహ్వాన కమిటీ సభ్యులు బిఎల్.నారాయణ, తీపర్తి సతీష్,ఆళ్ల బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ఎగ్ కార్ట్‌తో మహిళలకు ఉపాధి

ప్రజాశక్తి- రాజోలు

డ్వాక్రా మహిళలకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు కూటమి ప్రభుత్వం ఎగ్ కార్ట్‌ల వినూత్న పథకానికి శ్రీకారం చుట్టిందని రాజోలు ఎంపిపి కడలి శ్రీ దుర్గ అన్నారు. శుక్రవారం రాజోలు మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. రూ.50 వేలు విలువైన ఎగ్‌కార్ట్‌లను సాయి సునంద డ్వాక్రా గ్రూపునకు చెందిన కాళ్ళ రామలక్ష్మికి ఆమె అందజేశారు. గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్ట్ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్,చాగంటి స్వామి,ఎపిఎం వర్మ,కాట్న రాజు,కోళ్ల బాబీ,దారపురెడ్డి బాబ్జి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - కాట్రేనికోన

విద్యుత్‌లైన్‌ల్లో మరమ్మతుల కారణంగా నేడు శనివారం సరఫరాకు అంతరాయం కలుగు తుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె రాంబాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు కాట్రేనికోన సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. పల్లంకూరు నూతన సబ్ స్టేషన్ పనుల నిమిత్తం ఈ అంతరాయం ఏర్పడుతుందని, విద్యుత్తు లైన్లో మరమతులు వంటి పనులు చేపట్టడతామన్నారు.